# న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : మహిళా చట్టాలు
సెక్షన్ పరిధి : సాంఘిక చట్టాలు
ఉప సెక్షన్ పరిధి : సతీసహగమన (నిషేధ) చట్టం

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

సతీ సహగమన దురాచారానికి వ్యతిరేకంగా భర్త మరణించినప్పుడు స్త్రీని సజీవంగా అతని శవంతో పాటు కాల్చడం కాని, లేక పూడ్చిపెట్టడం కాని, లేక అతనికి సంబంధించిన ఏదైనా ఒక వస్తువుతో కాని ఆమెను కాల్చినప్పుడు, లేదా ఆమెను మత్తులో ఉంచి ఈ విధమైన చర్యకు పాల్పడితే దానిని సతిచేయడం అంటారు.

## విపులంగా న్యాయ వివరాలు

1. జీవించి ఉండగానే స్త్రీని భర్త చితిలోకి కానీ మరి వేరే బంధువుల చితిలో కాని తోసి కాల్చిచంపడం నిషేధం.
2. సతీసహగమనం చేయాలని ప్రయత్నించిన వారికి సంవత్సరం వరకు జైలు శిక్ష లేక జరిమానా లేక రెండూ విధించవచ్చు. అయితే శిక్ష విధించే ముందు సతికి పాల్పడిన వ్యక్తి ఎటువంటి పరిస్థితుల్లో ఆ చర్యకు పూనుకుందో వారి మానసిక స్థితి ఏ విధంగా ఉందో పరిశీలించి మాత్రమే సంబంధిత కోర్టు శిక్ష వేయాలి.
3. భార్య సతీసహగమనం చేస్తే ఆమెకు, లేక మరణించిన భర్తకు, కుటుంబానికి పరలోకంలో మేలు కలుగుతుందని నమ్మించడం నేరం.
4. సతీమాత కావాలనుకున్న స్త్రీకి సహాయంగా ఆమెను ఆ భర్త చితివరకు తీసుకునిపోవడం కూడా నేరమే. సజీవ దహనం కాకుండా స్త్రీ తనను తాను రక్షించుకొనే ప్రయత్నానికి అడ్డుపడటం కూడా సతిని ప్రోత్సహించినట్లే.

5. బలవంతంగా సతిని చేయించడానికి ప్రయత్నించిన వారికి మరణశిక్ష లేక జీవితఖైదు, జరిమానా విధించబడతాయి.
6. సతిని కీర్తించడం నేరం, శిక్షార్హం. సతీమాతను కీర్తిస్తూ పండగలు జరపడం, ఊరేగింపులు తీయడం, 'సతి' జరిగిన వెంటనే ఆ విధంగా చేసిన స్త్రీని పొగుడుతూ కార్యక్రమాలు చేయడం ట్రస్టును ఏర్పరచి విరాళాలు తీసుకోవడం, గుళ్ళు కట్టడం నేరాలే. వీటికి సంవత్సరం నుండి ఏడుసంవత్సరాల వరకు జైలు శిక్ష, అయిదువేల రూపాయల నుండి ముప్పైవేల రూపాయల వరకు జరిమానా విధిస్తారు.
7. సతి జరుగుతుందని తెలిసినా, జరపాలని ప్రయత్నిస్తున్నారన్న సమాచారం అందినా ఆ జిల్లా కలెక్టర్ వెంటనే అలాంటి వాటిపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీచేయాలి, అంతే కాకుండా సతీమాతను కీర్తిస్తూ చేసే ఏ ప్రయత్నాన్నయినా అడ్డుకునేందుకు నిషేదాజ్ఞలు జారీచేయాలి. ఈ నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే సంవత్సరం నుండి ఏడు సంవత్సరాల వరకు జైలుశిక్ష, అయిదువేల నుండి ముప్పైవేల వరకు జరిమానా విధిస్తారు.
8. సతీమాత గుళ్ళను వెంటనే తొలగించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
9. సతీమాత పేరిట వసూలు చేసే వేరాళాలను వెంటనే జప్తు చేయాలి.
10. ఈ కేసులను విచారించడానికి ప్రత్యేక కోర్టులను స్థాపించాలి.
11. ఈ చట్టం కింద నేరస్థులుగా నిరూపించబడినవారు ఎన్నికలలో పాల్గొనడానికి వీలు లేదు. వీరు శిక్ష నుండి విడుదల అయిన 5 సంవత్సరాల వరకు వారికి ఎన్నికలలో పాల్గొనే అర్హత ఉండదు.

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

సెక్షన్ 3 : సతీసహగమనం చేయాలని ప్రయత్నించిన వారికి శిక్ష

సెక్షన్ 4 : సతీమాత కావాలనుకున్న స్త్రీకి సహాయము చేసేవారికి శిక్ష

సెక్షన్ 5 : సతిని కీర్తించేవారికి శిక్ష

సెక్షన్ 6 : జిల్లా కలెక్టరుకు, జిల్లా మేజిస్ట్రేటుకు సతిని నిషేధించే అధికారాలు

సెక్షన్ 7 : అప్పీలు

సెక్షన్ 18 : నేరస్థులు ఎన్నికలలో పాల్గొనడానికి అనర్హులు

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

జిల్లా కలెక్టరు లేదా జిల్లా మేజిస్ట్రేటుకు ఫిర్యాదు చేయవచ్చు. సమాచారం అందిన వెంటనే వారు నిషేధాజ్ఞలు జారీ చేస్తారు.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

చట్ట ప్రకారం సతీ కేసులను విచారించడానికి ప్రత్యేక కోర్టులను ప్రభుత్వం ఏర్పరచాలి. వాటికి సెషన్సు కోర్టులకు ఉన్న అధికారాలు ఉంటాయి.

పోలీసుకో, మేజిస్ట్రేటుకో ఫిర్యాదు చేస్తే వారు కేసును నేర ప్రక్రియ శిక్షా స్మృతి కింద కేసును ముందుకు నడుపుతారు.

కోర్టువారు విచారణ జరిపి, సాక్షులను పరీక్షించి, నిందితుడు అపరాధం చేసాడని రుజువైతే, అతనిని తగిన విధంగా శిక్షిస్తారు.

## తరువాత

ప్రత్యేక కోర్టువారి ఆదేశాలపై 30 రోజులలో హైకోర్టులో అప్పీలు వేయవచ్చు.

## ప్రత్యామ్నాయ పరిష్కారం

ప్రత్యామ్నాయ పరిష్కారాలు లేవు